ఈ వుద్యోగం వదులుకోబా అనేంతగా విసిగిస్తాయి బదిలీలు. ఆరోజు యథాప్రకారం ఆఫీసుకెళ్ళిన నాకు బందరు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ ఇస్తూ ఆఫీసర్ "గుడ్‌లక్"అని కరచాలనం చేసినప్పుడు, నాకు సామాను సర్దడం, లారీ మాట్లాడడం, కొత్త వూర్లో ఇల్లు చూడడం, ఆ ఇక్కట్లన్నీ గుర్తొచ్చి నా చేయి ఆఫీసర్ చేతిని బిగించింది. పాపం ఆఫీసర్ కంగారు పడిపోయి మళ్ళీ గుడ్‌లక్ అన్నాడు. చేయి విడిపించుకున్నట్లుగ కదిలి. అప్పుడు నేను స్పృహలోకివచ్చి ఓ సన్నటి నవ్వు నవ్వి చేయి వదిలాను.

బందరు వెళ్ళి జాయినింగ్ రిపోర్టిచ్చి ఇల్లు వెదకడం మొదలెట్టాను. ఎట్లా అయితేనేం చివరకు ఓ ఇంటిని పట్టాను. ఆ ఇంటి వాళ్ళెవ్వరూ ఇంటిని గురించి మాట్లాడలేదు. ఇంటి పనిమనిషే అద్దె, షరతులు చెప్పి అడ్వాన్సు తీసుకున్నాడు. రెండు రోజుల్లో సంసారాన్నంతా చేరవేసాను అద్దె ఇంట్లోకి.

పెద్దమేడలో ఇంటివాళ్ళుంటున్నారు. ఆ ఆవరణలోనేవున్న గెస్ట్‌హవుస్‌లాంటి చిన్న ఇల్లే మాకు అద్దెకిచ్చింది.

ఆ ఇల్లు నాకు నచ్చింది. మా సీతకు మరీ నచ్చింది. ముందు వరండా, మధ్య హాలు, వెనుగ్గా ఓ కిచెన్, డైనింగ్ రూము, బాత్‌రూము వగైరా. పెద్ద విశాలంగా లేకపోయినా మాకూ, మా ఇద్దరి పిల్లలకూ సరిపోయింది. గాలి, వెలుతురూ బాగా వస్తుంది. అన్నిటికన్నా ముందున్న తోట మరీ బావుంటుంది. దాని చుట్టూ ఎత్తైన ప్రహరీగోడ వుంది. అందుకే ఇంట్లోకి రాగానే మనకూ, ప్రపంచానికి లంకె తెగిపోయినట్లనిపిస్తుంది.

మరీ తెల్లవారిపూట స్నానించి, ఆ చెట్ల నీడలో కాఫీ తాగుతూ సిగెరెట్టు వెలిగించి, చదువుతుండడం చాలా బావుంటుంది.కానీ ఇంటి యజమానురాలు మాత్రం ఎప్పుడూ ఎవర్నో కేకలేస్తూ వుంటుంది. ఆ గలాభానే లేకపోతే తపస్సు చేసుకునే ఋషిలా ఆ ఇల్లు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేది. ఆమె ఎవర్ని అంతగా కేకలేస్తుందో నాకు తెలియదు. ఆమెను చూడాలన్నా వీలుపడేదికాదు. ఇంటి గడపదాటి బయటకు రాదు. ఎప్పుడైనా క్షణమో, అందులో అర్థభాగమో అలా మెరిసి మాయమయ్యేది. పరికించి చూడకపోయినా ఆమె చాలా అందంగా ఉన్నట్లనిపించింది. అంత అందమైన ఆమె అంత కటువుగా ఎలా మాట్లాడుతుందో నా కర్థం కాలేదు.

ఎప్పుడేనీ నేను బయట కూర్చున్నప్పుడు అటుగావస్తే నన్ను చూసి తక్కున మూతిని చివచివలాడించి, వెనక్కి గిర్రున తిరిగిపోయేది. ఆడవాళ్ళు అలా ప్రవర్తిస్తే నాకు ఎబ్బెట్టుగా తోస్తుంది.

లాగి లెంపకాయ కొట్టాలన్నంత కోపమూ వస్తుంది. చెడిపోయినవాళ్ళో(వాళ్ళ ఉద్దేశంలో), చెడిపోవాలనుకొనేవాళ్ళో అలా ప్రవర్తిస్తారని నా అభిప్రాయం. అలాంటి స్త్రీల మీద మొదట కోపం వచ్చినా, తరువాత జాలికలుగుతుంది.

అందుకేనేమో ఇంటి నాకరు వెంకన్నను కదిలించి అన్ని విషయాలూ రాబట్టగలిగాను.

ఆమె పేరు సుషమ. ఎరవై ఏడో, ఎనిమిదో ఏళ్ళుంటాయి. వాళ్ళవూరు గుడివాడ దగ్గరున్న పల్లెటూరు బాగా ఆస్తిపరులు. సనాతన ధర్మపరాయణులు కావడంచేత సుషమకు రవికతో పాటు వక్షస్థలంమీద పైటలాంటిది అవసరం వచ్చిన రోజున అర్జనకర్తనలు జరిగి ఎనిమిదో తరగతినే చదువుకు మంగళం పాడించేశారు. పైటవేసిన ప్రతి ఆడపిల్లకూ మొగుడి అవసరం వుంటుందని తెలిసినవాళ్ళు కావడంతో త్వరగానే పెళ్ళి చేసేశారు. మొగుడి అవసరంవుందని తెలిసినవాళ్ళేగానీ 'ఎలాంటి మొగుడు' కావాలన్నది తెలియదు కాబట్టి అప్పటికే ముప్పైఏళ్ళు నిండిన ఆ వ్యాపారస్తుడికిచ్చి పెళ్ళి చేసేశారు.

"మా అమ్మగారికింకా పిల్లల్లేరండీ" అని



వెంకన్న చెప్పినప్పుడు నాకు మాత్రం ఆశ్చర్యం కలుగలేదు. 'అహా' అని వూరుకున్నాను.

"మా అయ్యగారికెప్పుడూ యాపారం ధ్యాసే బాబూ ఇంటిపట్టున వుండేది తక్కువ. ఈ మధ్యనే మరో రెండు రైసుమిల్లులు కట్టించారు" అని ఆ వివరాలు, వాళ్ళయ్యగారి ఘనత గురించి గొప్పగా చెప్పాడు.

"ఎందుకు మీ అమ్మగారు అలా కేకలేస్తూ వుంటారు? ఇంతకీ ఎవర్ని" అని అడిగాను. ఇదే మొదటి నే ప్రశ్నించాలనుకున్నది.

ఈ ప్రశ్న వింటూనే వెంకన్న దీనంగా తయారై "ఏమో బాబూ! మొదట్లో అంటే అమ్మగారు కాపరానికొచ్చినప్పుడు మా బాగా వుండేవారు. అందరితోనూ చక్కగా మాట్లాడే వారు మమ్మల్ని కూనా దయగా సూసుకొనేవారు కన్నబిడ్డలకిమల్లె. ఆదేం కర్మో బాబూ! ఆ తరవాతరవాత కూనా మారిపోయారు. మరీ పిసినారికి మల్లేనూ, కర్కోటకంగానూ అయ్యారు. యెంతపని చేస్తున్నా ఎప్పుడూ దేనికో దానికి పూరికే తిడతానే వుంటారు. జీతం డబ్బులు కూడా సరిగా ఇవ్వరు. ఎప్పుడూ బాధ నాక్కాతే బాబూ!" అని బాధపడుతూ చెప్పాడు. తన అవస్థల గురించిన బాధకంటే వాళ్ళమ్మగారు అలా అయిపోయారనే దిగులు నాకెక్కువగా కనిపించింది.

మీరెక్కడా అనొద్దు బాబూ! సిన్న, సిన్న గొంగతనాలు కూడా మరిగారు. కూరగాయలు తూస్తున్నప్పుడు చాటుగా ఒకటి, రెండు ఎత్తుకునేస్తుంది" అని గొంతు తగ్గించి చెప్పాడు.

"నన్నేకాదు. మా ఆడదాన్ని అంతే బాబూ! ఎప్పుడూ తిట్లే. సుబ్బరంగా ముకం కడుక్కుని, జుట్టు దువ్వుకుని కనిపిస్తే సిర్రుబుర్రులాడతందయ్యా! యేంటా బోగమేళాలని యిడా పెడా నోటికొచ్చిన మాటలనేస్తుంది..." ఇలా వెంకన్న ఆమె గురించి చాలానే చెప్పాడు. ఆమె గురించే ఎక్కువ ఆలోచించడం మొదలెట్టాను.

ఓ రోజు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన నాకు కాస్త వణికాయి. మా సీత, సుషమ పీధిలోకి వినిపించేటంతగా మాటా మాటా అనుకుంటున్నారు. నాకు తెలిసి, యిన్నేళ్ళలో మా

ఎమ్.మల్లి

'బ్లాటింగ్'

సీత ఎవరిని పల్లెత్తు మాట అనగా వినలేదు నేను. నే వెళ్ళేసరికి వచ్చిగా, దాసీగా, అనర్గళంగా తిడుతూ వుంది సుషమ సీతని. నన్ను చూస్తూనే సీత కళ్ళల్లో నీరు మరింత ఎక్కువైంది.

"సీతా! ఏంటది లోపలికెళ్ళు" అని కటువుగా అన్నాను. సీత వెళ్ళిపోయింది. సుషమ వాక్ప్రవాహం ఇంకా సాగుతూనే వుంది. అంత ఇదిలోనూ ఆమె అందం నన్ను కలవరపెట్టింది. ఆమె వేషధారణ వల్లనో, లేక ఆమెలోనో ఏదో తెలియని హుందాతనం వుంది. కళ్ళ సైగలతో ప్రపంచాన్ని శాసించగలిగిన ఆమె అలా ప్రవర్తించటం సహించలేకపోయాను. చీప్‌గా ఆమె మాట్లాడటం మాత్రం నాకు ఆశ్చర్యం వేసింది. మా ఇంట్లోకొచ్చాను.

సీత ఏడుస్తూ వుంది. ఆమె అభిమానంమీద చాలా గట్టిదెబ్బే తగిలుంటుంది. అందుకే దగ్గరికెళ్ళి వూరడించాను.

"ఏమిటండీ ఆమె. నేనేం అన్లేదు తనని. ఏదోలా వుంటుంది కాబట్టి నేనెప్పుడూ మాట్లాడలేదు. సాయంకాలం మన పెద్దది వెళ్ళి టేప్ ఆన్ చేసిందంట. అంతే, చిన్నపిల్లైనా అని లేకుండా వాయించేసింది. దాని చెంప చూస్తే మీకే తెలుస్తుంది. మాటవరసకి వెళ్ళి అడిగాను. దానికి ఎంత ఎత్తు ఎగిరిందనుకున్నారు. మీరే చూసారుగా." అని వెక్కివెక్కిపడ్తూ అంది సీత.

"సరేలే. ఆ విషయం గురించి నువ్వేం బాధపడకు. కొందరంతే. యేదో ఛేద్దాం" అని అననయించాను.

ఇంతకుముందు కూడా సీత, సుషమ పెద్దదాని మూలాన మాటామాటా అనుకున్నారట. ఇక లాభంలేదని ఇల్లు మారాలని నిర్ణయించుకున్నాను.

కానీ సుషమను అలా వదిలివేయడం నా కిష్టం లేదు. ఎంత మందిని ఇబ్బందులకు గురిచేస్తుందో ప్రత్యేకించి చూశాను. ఈ విషయాలన్నిటను ఎనలైజ్ చేసి ఆమె భర్తకు చెప్పినా ప్రయోజనం లేదు. ఇంత క్రితం ఎప్పుడో అవసరంవచ్చి రెండు, మూడుసార్లు ఆయనతో మాట్లాడాను. ఏమీ పరిచయంలేని నా దగ్గర కూడా ఆయన తన వ్యాపారాల విషయాల గురించే మాట్లాడి బోర్ కొట్టారు.

ఇక లాభంలేదని ఆ ఇల్లు ఖాళీచేసే రోజున వెంకన్నను పిలిచి చెప్పాను.

"వెళ్ళిపోతున్నారా బాబూ" అని వెంకన్న చాలా బాధపడ్డాడు.

సుషమ కథకు ముగింపును రెండు రకాలుగా ఊహించగలను కనుక క్రమంగా నేను ఆమెను మరిచిపోయాను.

* * * *

అన్నేళ్ల తరువాతనుకొంటాను. ఓ రోజు బజారులో వస్తుంటే సుషమ పనిమనిషి వెంకన్న కనిపించాడు.

"దండాలు బాబూ! బాగున్నారా" అని అభిమానంతో పలకరించాడు. చాలా హుషారుగా కనిపించాడు.

నేను తిరిగి బదులుచెప్పేలోపే "బాబుగారు మీకో విషయం సెప్పాల.... మా అమ్మగారు చాలా మారిపోయారు. ఎనకటికిమల్లే వుంటున్నారు. మాతో చానా దయగా వుంటున్నారు. అమ్మగారూ చాలాఆనందంగావుంటున్నారు బాబుగారూ ఇప్పుడు ఒట్టిమనిషి కూడా కాదండి...." వెంకన్న చెప్పుకుపోతున్నాడు.

నాకేదో స్ఫురించినట్లు ఆ ఇల్లు ఖాళీయేనా" అనడిగాను.

"లేదు బాబూ! మీరెళ్ళిన తరువాత ఒక బ్బాయి కట్టాను. యేదో పెద్దసదువే సదివినాదంట. బ్యాంక్‌లో ఉద్యోగం. ఇంకా పెళ్ళి కాలేదు. మంచికుర్రోడు"

నేనుసుషమగురించిన ముగింపుల్లో మొదటిది ఆమెనుపిచ్చాసుపత్రిలో చేర్చారన్న వార్తవింటానని. ఇప్పుడువింటున్న ముగింపు రెండవది. ఇది సాధ్యపడుతుందనుకోలేదసలు. అయినాజరిగింది.

"మా అమ్మగారిప్పుడు వెనకట్లా కాదు. అయినదానికి కానిదానికి కస్సుబుస్సు లాడటం లేదు....అంతా ఆ దేవుడి దయ" అని తృప్తిగా తలాడించాడు.

"అట్లాగా" అన్నాను నన్ను నేను అభినందించుకుంటూ. అదేసమయంలో నా మనసు ఏదో వెలితిగా అనిపించింది. వెకిలిగా వెక్కిరించింది కూడా!

*

